## క్లుప్తంగా

### ప్రజల వద్దకే పాలన

- పలు ప్రభుత్వ భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే రెడ్డి శాంతి



మర్రిపాడు-సిలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

**మెళియాపుట్టి:** గ్రామాల్లో ప్రభుత్వ భవనాలు నిర్మించి ప్రజల వద్దకే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన తీసుకువచ్చారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని మర్రిపాడు-సి గ్రామంలో సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, పెద్ద పద్మాపురం, ఇల్లాయిపురం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు, కేరాసింగి సచివాలయ పరిధి గొడ్డ గ్రామంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను మంగళవారం ప్రారంభించారు. సీఎం జగన్ తీసుకువచ్చిన పథకాలు పలు రాష్ట్రాల్లో అమలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారన్నారు. అనంతరం గొడ్డ, ఇల్లాయిపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు జరిగిన లబ్ధిని వివరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

### విద్యుత్ సేవల్లో సిబ్బంది పాత్ర భేష్



పురస్కారాన్ని అందుకుంటున్న లైన్‌మన్ కృష్ణారావు

**హిరమండలం:** విద్యుత్ సేవలు అందించడంలో సిబ్బంది పాత్ర వెలకట్టలేనిదని టెక్కలి డివిజనల్ విద్యుత్‌శాఖ డీఈ శంకరరావు అన్నారు. ఉత్తమ లైన్‌మన్లుగా హిరమండలానికి చెందిన ఎల్ఎం జి.కృష్ణారావు, గ్రేడ్-2 లైన్‌మన్లు బి.సుబ్రహ్మణ్యం, ఎ.సోమేశ్వరరావు ఎంపికయ్యారు. జాతీయ లైన్‌మన్ దినోత్సవం సందర్భంగా మంగళవారం వీరికి పురస్కారాలు అందించారు. డీఈ మాట్లాడుతూ విద్యుత్ శాఖ సిబ్బంది సేవాభావంతో పనిచేయాలన్నారు. అత్యవసర విభాగాల్లో విద్యుత్ శాఖ ఒకటన్న విషయాన్ని గమనించాలని కోరారు. ఉత్తమ లైన్‌మన్లుగా నిలిచిన వారికి పాతపట్నం ఏడీ జీవీవీఎస్ ప్రసాద్, హిరమండలం ఏఈ వెంకటేశ్వరరావు, సిబ్బంది అభినందించారు.

### చెడు వ్యసనాలతో జీవితాలు నాశనం



అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసరావు

**మెళియాపుట్టి:** విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, చెడు వ్యసనాలతో జీవితాలు నాశనమవుతాయని జిల్లా మానసిక వైద్యనిపుణుడు డి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చాపర జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు మానసిక ప్రవర్తన శైలిపై మంగళవారం అవగాహన కల్పించారు. విద్యార్థి దశలో మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, తద్వారా విద్యపై ఆసక్తి పెరిగి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టి పోటీ ప్రపంచంలో నెగ్గుకు రావాలని పిలుపునిచ్చారు. మత్తుపదార్థాలకు బానిసలు కాకుండా మానసిక ప్రశాంతత కలిగించే విషయాలను చెప్పారు. కొద్దిమంది విద్యార్థులకు ప్రత్యేక సలహాలను అందించారు. ఈ కార్యక్రమంలో మానసిక కార్యకర్త అచ్యుతరావు, చాపర పీహెచ్‌సీ వైద్యులు పావని, హేమంత లక్ష్మి, హెచ్ఎం ఎ.గణపతిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పరామర్శ..



లోకేష్‌ను పరామర్శిస్తున్న కృష్ణచైతన్య

**సారవకోట:** రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని బెజ్జి గ్రామానికి చెందిన వాడవలస లోకేష్‌ను పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య మంగళవారం పరామర్శించారు. శస్త్రచికిత్స చేసుకున్న వాడవలస సరస్వతీని పరామర్శించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు గెల్లంకి అనీల్, చంద్రరావు, భీమారావు, రమణ తదితరులు ఉన్నారు.

### మండల సర్వసభ్య సమావేశం రేపు

**సరుబుజ్జిలి:** మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం 3 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కిల్లి రమాదేవి అధ్యక్షతన నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ జి.రత్నం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చ ఉటుందన్నారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులుహాజరు కావాలని కోరారు.

# సంక్షేమ సారథి సీఎం జగన్



సైరిగాంలో తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- మీకు మేలు జరిగితే ఓటు వేయండి
- 14 ఏళ్లల్లో చంద్రబాబు ఏం చేశారో ప్రశ్నించండి
- పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

**జలుమూరు:** అర్హులందరికీ సంక్షేమం అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అవసరాలు తీర్చిన వారే మనకు నిజమైన నాయకులని అన్నారు. ప్రజలు వాస్తవాలు గమనించి మనకు మంచి చేసిన జగనన్నను గెలిపించుకునేందుకు మీరు సిద్ధంగా ఉన్నారా అని అడగ్గా మేం సిద్ధమని మద్దతు తెలిపారు. 14 ఏళ్ల సీఎంగా ఉన్న చంద్రబాబు పేద ప్రజలకు ఏం మేలు చేశారో మీ వద్దకు వస్తున్న టీడీపీ నాయకులను ప్రశ్నించాలన్నారు. చంద్రబాబు, టీడీపీ నాయకులు చెప్పే మాయమాటలు నమ్మవద్దన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన సీఎం జగన్‌కు రానున్న ఎన్నికల్లో మద్దతుగా నిలవాలని కోరారు.

**ప్రారంభాలు ఇలా..**

సైరిగాం పంచాయతీలో రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన మంచినీటి పథకం , రావిపాడులో రూ.23 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, తిలారు జంక్షన్ నుంచి రైల్వేస్టేషన్ వరకు రూ.25 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించారు. పెద్దదూగాంలో రూ.43 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, ఇదే పంచాయతీలో రూ. 20.80 లక్షలతో నిర్మించిన హెల్త్ సెంటర్, రూ.13 లక్షలతో నిర్మాణం పూర్తి చేసిన రోడ్డు, రూ.26.70 లక్షలతో ఏర్పాటు చేసిన ఇంటింటికీ కుళాయిలు ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో బీసీ జోనల్ ఇన్‌చార్జ్, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య, ఎంపీపీ వాన గోపి, అల్లాడ, చల్లవానిపేట సొసైటీ అధ్యక్షులు ఎం.శ్యామలరావు, రాజప్పల నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, పైడి విఠల్‌రావు, సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్, మూకళ్ల సత్యం, తర్ర జీవరత్నం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు పెద్దపీట



ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

**మెళియాపుట్టి:** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికారతకు పెద్దపీట వేశారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద జగనన్న కాలనీలకు సంబంధించిన ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. మండలంలో ఇళ్లులేని నిరుపేదలైన 772 మందికి స్థలాలిచ్చామన్నారు. ప్రజల అవసరాన్ని గుర్తించి నవరత్నాలు అందించిన గొప్ప నాయకుడు సీఎం జగన్ అని అన్నారు. సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య, వైఎస్సార్ సీపీ నాయకుడు బైపోతు ఉదయ్‌కుమార్, శశిభూషణ్‌రావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బాలరాజు, పోలాకి జయమునిరావు, ఎంపీటీసీ నక్క కాత్యాయని, ఎంపీడీఓ భాస్కరరావు, ఏఈ శ్రీనివాసరావు, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# ఓటు హక్కు వినియోగంపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న స్వయం శక్తి సంఘాల మహిళలు

**నరసన్నపేట:** ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ కొండలరావు అన్నారు. ఓటు హక్కుపై అవగాహనలో భాగంగా నరసన్నపేటలో స్వయం శక్తి మహిళలు, వెలుగు సీసీలు, సీఎఫ్‌లు మంగళవారం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ ఓటును వినియోగించుకోవడం వల్ల మంచి పాలకులను ఎన్నుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు చింతు శ్రీదేవి, ఏపీఎంలు సాయి లక్ష్మి, హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

### రహదారి పనులు ప్రారంభం

**కొత్తూరు:** మండల కేంద్రంలోని బజాజ్ షోరూమ్‌కు అనుకుని ఉన్న మట్టి రోడ్డులో సీసీ రోడ్డు పనులను స్థానిక సర్పంచ్ పడాల కృష్ణవేణి మంగళవారం ప్రారంభించారు. పంచాయతీ నిధులతో ఈ పనులు చేపపడుతున్నట్లు తెలిపారు. పంచాయతీలో నూతనంగా ఏర్పడిన కాలనీల్లో దశల వారిగా రోడ్డు పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పడాల లక్ష్మణరావు, గోగుల వరప్రసాదరావు నాయుడు, లోతుగెడ్డ జనార్దనరావు ఉన్నారు.

# ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి



హౌసింగ్ డీఈఈ నర్సింగరావుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

**పాతపట్నం:** నియోజకవర్గంలో పీఎంఏవై, జగనన్న కాలనీ పథకంలో భాగంగా మంజూరైన ఇళ్ల నిర్మాణాలు వెంటనే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులకు పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి సూచించారు. పాతపట్నంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం గృహనిర్మాణశాఖ డీఈఈ వి.నర్సింగరావుతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పీఎంఏవై, పీఎం జన్‌మన్, పీఎంఏవై వైఎస్సార్ ఉడా పథకంలో 7,159 ఇళ్లకు రూ.31.80 కోట్ల నిధులు లబ్ధిదారుల ఖాతాలో జమచేయడం జరిగిందన్నారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాలను కూడా పూర్తి చేయించాలన్నారు. నియోజకవర్గంలో ఐదు మండలాల్లో 138 జగనన్న కాలనీల లే అవుట్లలో 3,163 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావస్తున్నాయన్నారు. పాతపట్నం మండలంలో 1,778 ఇళ్లకు రూ.9.15 కోట్లు, మెళియాపుట్టి మండలంలో 1,773 ఇళ్లకు రూ.8.21కోట్లు, కొత్తూరు మండలంలో 1,966 ఇళ్లకు రూ.7.69కోట్లు, హిరమండలం మండలంలో 870 ఇళ్లకు రూ.3.71కోట్లు, ఎల్.ఎన్.పేట మండలంలో 772 ఇళ్లకు రూ.3.03కోట్ల నిధులు మంజూరయ్యారన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# మూలకు చేరిన ఎన్టీఆర్ జలసిరి యూనిట్!

- తొలగించాలని రైతు వినతి



పాలవలస వద్ద వృథాగా ఉన్న ఎన్టీఆర్ జలసిరి యూనిట్

**సరుబుజ్జిలి:** గత టీడీపీ ప్రభుత్వ హయంలో రైతుల వివిధ రకాల పంటలు సాగు చేసుకునేందుకు ఎన్టీఆర్ జలసిరి బోర్లును మంజూరుచేశారు. అప్పట్లో మండలంలోని పలు గ్రామాలకు దాదాపు 30 యూనిట్లు వరకు మంజూరయ్యాయి. వాటిలో చాలాయూనిట్లు పనిచేయక మూలకు చేరాయి. జిల్లాలో పలు మండలాల్లో కూడా రైతులు ఈ యూనిట్లు నిర్మించి ఇలాంటి సమస్యలే ఎదుర్కొంటున్నారు.

**మూణాళ్ల ముచ్చటే..**

గత టీడీపీ ప్రభుత్వ హయంలో ఎన్టీఆర్ జలసిరి పథకం కోసం డిపాజిట్‌గా రూ.25 వేల డీడీని ప్రభుత్వానికి చెల్లించాను. ఉచితంగా రిగ్, సోలార్ ప్యానల్ ఏర్పాటు చేశారు. రిగ్ బోరు అనుకున్న లోతువరకు తవ్వక పోవడం వల్ల భూగర్భ జలాలు బయటకు ప్రవహించక మూణాళ్లకే యూనిట్ మూలకు చేరింది. సోలార్ ప్యానల్స్ చుట్టూ పిచ్చిమొక్కలు గుబురుగా పెరిగాయి. దాదాపు 70 సెంట్లు విస్తీర్ణంలో గల పొలంలో యూనిట్ నిర్మించాను. యూనిట్ తొలగించాలని గత 6 ఏళ్లుగా అధికారులకు పలుమార్లు విన్నవించాను. తొలగించక పోవడం వల్ల పంటలు వేసేందుకు, మొక్కలు నాటేందుకు ఇబ్బందిపడుతున్నాను. పనిచేయని యూనిట్‌ను తొలగించాలని సంబంధిత అధికారులకు తెలియజేసినా పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఎన్టీఆర్ జలసిరి పథకం వల్ల తన డబ్బుతోపాటు, స్థలం, సమయం వృథాగా మారింది.

– కరణం ఢిల్లేశ్వరరావు, రైతు, పాలవలస

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం**

జలసిరి యూనిట్ తొలగింపునకు సంబంధించిన సమాచారం తమ వద్దలేదన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయం తీసుకువెళ్తామన్నారు. అధికారుల సూచనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

– ఉపాధి హామీ ఇంజనీరింగ్ కన్సల్టెంట్, రమాదేవి

### రికవరీలు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న జిల్లా విజిలెన్స్ అధికారి లవరాజు

**సారవకోట:** సామాజిక తనిఖీల్లో చెల్లించాల్సిన రికవరీలు ఈ నెల 10 లోగా చెల్లించాలని ఉపాధి హామీ పథకం జిల్లా విజిలెన్స్ అధికారి బి.లవరాజ్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలో చేపట్టిన 15 సామాజిక తనిఖీల్లో రూ 2.37 లక్షలను 20 మంది టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రికవరీ చేయాల్సి ఉందన్నారు. 100 రోజుల పనిని ఎక్కువ కుటుంబాలకు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీఓ నారాయణరావు ఉన్నారు.

### ఉల్లాసంగా.. ఉత్సాహంగా



కొత్తూరు: డాన్స్ చేస్తున్న విద్యార్థులు

**నరసన్నపేట:** స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం మంగళవారం సందడిగా నిర్వహించారు. ఎంఈఓ పేడాడ దాలినాయుడు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉర్లాం ఉన్నత పాఠశాలలోనూ టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.

**జలుమూరు:** లింగాలవలస ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎంఈఓ ప్రసాదరావు, వ్యవసాయ మండలి చైర్మన్ బుక్కా లక్ష్మణరావు, హెచ్ఎం ఉంగటి సూర్యనారాయణ పాల్గొన్నారు.

**హిరమండలం:** తంప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ డే వేడుకలు నిర్వహించారు. ఎంఈవో రాంబాబు మాట్లాడుతూ పరీక్షలను ఎటువంటి ఒత్తిడి లేకుండా రాయాలన్నారు. ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యే విద్యార్థులకు రూ.2 వేల చొప్పున నగదు సాయం అందజేయనున్నట్లు తెలిపారు. ప్రీఫైనల్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన యుగంధర్ అనే విద్యార్థికి రూ.500 నగదు సాయం అందించారు.

**కొత్తూరు:** కడుము జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమలతో సందడి చేశారు. పలు రకాల పోటీల్లో విజేతలకు సర్పంచ్ ఎం.రామారావు, ఎంపీటీసీ సభ్యుడు గోవిందరావు, మాజీ సర్పంచ్ ధర్మారావు బహుమతులు అందజేశారు. హెచ్ఎం గొర్లె తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

### తాగునీటి బోరు ఏర్పాటు



బోరు తవ్వకానికి భూమిపూజ చేస్తున్న వైస్ ఎంపీపీ

**కొత్తూరు:** మండలంలోని గురండి పంచాయతీ పరిధి కాశీపురం గ్రామంలో మండల పరిషత్ నిధుల నుంచి మంజూరైన బోరు తవ్వకాన్ని వైస్ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు మంగళవారం ప్రారంభించారు. సర్పంచ్ బోర సింహాద్రి నాయుడు వినతి మేరకు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే అధికారులకు ఆదేశించామన్నారు. సర్పంచ్ సింహాద్రి నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు లోతుగెడ్డ తాతాబాబు, భగవాన్‌దాసు నాయుడు, పడాల వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### విశాఖ వెళ్లి పించన్ అందజేత



పించన్ అందజేస్తున్న వలంటీర్ రామ్మోహన్

**ఆమదాలవలస:** మున్సిపాలిటీ పరిధి రావికంటిపేటకు చెందిన గాడిపల్లి సూర్యనారాయణ అనే వృద్ధుడు గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. వలంటీర్ కూర్మాన రామ్మోహన్ మంగళవారం కేజీహెచ్‌కు వెళ్లి పింఛన్ అందించారు. వృద్ధుడు సంతోషం వ్యక్తం చేశారు.

# అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం



గోకర్ణపల్లిలో రోడ్డును ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం

**పొందూరు:** అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని పలు రోడ్లు, భవనాలను మంగళవారం ప్రారంభించారు. గోకర్ణపల్లిలో రూ.5 లక్షలతో నిర్మించిన జిల్లా పరిషత్ రోడ్డు, రూ.5 లక్షలతో నిర్మించిన సచివాలయం రోడ్డు, రూ.5 లక్షలతో నిర్మించిన సచివాలయం కాంపౌండ్ వాల్‌ను ప్రారంభించారు. రూ.40 లక్షలతో నిర్మించిన పైడి జోగిపేట రోడ్డును, రూ.41 లక్షలతో నిర్మించిన గోరింట గ్రామ సచివాలయం భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ కిల్లి ఉషారాణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, సర్పంచ్ చింతాడ మాధురి, పార్టీ నాయకులు బాడాన వెంకట కృష్ణారావు, చింతాడ ప్రసాదరావు, రాణాప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే రెడ్డి శాంతి



సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

**ఎల్.ఎన్.పేట:** ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు సకాలంలో అందేలా చూడాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతికి సూచించారు. మంగళవారం విశాఖపట్నం వచ్చిన సీఎం జగన్‌ను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. పాతపట్నం నియోజకవర్గంలో సంక్షేమ పథకాల అమలు తీరును సీఎం జగన్ అడిగి తెలుసుకున్నారు. ఆడపడుచులకు ఇచ్చిన జగనన్న కాలనీ ఇళ్ల స్థలాలు మంజూరుతోపాటు కాలనీ ఇళ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలని సూచించారు. పాతపట్నం నియోజకవర్గంలో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలతో పాటు ప్రస్తుత రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఉన్నారు.

# వచ్చామా.. వెళ్లామా.. అంటే కుదరదు

- ఉపాధి హామీ చట్టం లక్ష్యాలను చేరుకోవాలి
- డ్వామా పీడీ చిట్టిరాజు



సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

**పోలాకి:** గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపడుతున్న పనుల పర్యవేక్షణకు వచ్చామా.. వెళ్లామా.. అనే ఒరవడితో కొనసాగిస్తే కుదరదని డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో క్షేత్రస్థాయి సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్లతో కలిసి పలు ప్రాధాన్యత అంశాలపై సమావేశం ఏర్పాటుచేశారు. ముఖ్యంగా ఉపాధి హామీ చట్టంలో లక్ష్యాలను శత శాతం చేరుకోవాల్సిందేనన్నారు. జిల్లాలో 1,16,102 మంది వేతనదారులను మార్చి 31 నాటికి వంద రోజుల పనిదినాలు కల్పించే విషయంలో ఎలాంటి రాజీ ప్రసక్తే లేదన్నారు. మిగిలిన జిల్లాలతో పోల్చితే కష్టపడేతత్వం కలిగిన వేతనదారులు ఉన్నప్పటికీ న్యూస్ట్రాటజీల అమలులో సిబ్బంది వెనుకబాటుపై అసహనం వ్యక్తం చేశారు. దాదాపు 3.24 లక్షల మంది వేతనదారులతో వచ్చే ఏడాది పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఎక్కడైనా పనికల్పించే లేదని ఫిర్యాదు వస్తే సంబంధిత ఫీల్డ్‌అసిస్టెంట్లపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. చీడివలస, ధీర్ఘాశి, పోలాకి, అంపలాం పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి పనులను పీడీ పరిశీలించారు. ఏపీడీ మురళీకృష్ణ, ఏపీఓ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణకు సహకరించండి



పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న ఆమదాలవలస సీఐ, పోలీసులు

**ఆమదాలవలస:** రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్నివర్గాలవారు సహకరించాలని ఆమదాలవలస సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.దివాకర్ వాయునందన్ కోరారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ప్రధాన రహదారిపై ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు పట్టణ పోలీసులు, రైల్వే పోలీసులతో మంగళవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఓటర్లు నిర్భయంగా ఓటు వేసుకునేలా పోలీసులు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. పలు రాజకీయ పార్టీల నాయకులు, పలు రంగాలకు చెందిన వ్యక్తులు పోలీసులకు సహకరించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కె.వెంకటేష్, ఆర్పీఎఫ్ ఎస్ఐ దీపక్‌కుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వంద పని దినాలు పూర్తిచేయాలి

**పాతపట్నం:** జాబుకార్డు ఉన్న ప్రతీ వేతనదారుడు ఈ నెలాఖరులోగా 100 రోజులపాటు పనులు పూర్తిచేయాలని ఏపీడీ పి.రాధ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం రెండు పూటలు ఎనిమిది గంటలు పనిచేయాల్సి ఉందన్నారు. కొలతల ప్రకారం వేతన చెల్లింపులు జరుగుతాయన్నారు. ఎంపీడీఓ రామకృష్ణరాజు, ఏపీఓ సురేష్, జేఈలు రవి, రామకృష్ణ పాల్గొన్నారు.